


నేనెప్పుడూ డైరీ అంటూ రాయలేదు. రాయాలని చాలా ఉబలాటమైతే వుండేదికాని ముఖ్యంగా బద్ధకమూ తరువాత నిజాయితీ లోపించటమూ నేను డైరీ రాయలేక పోవటానికి కారణాలని తేలింది. ఈ నిజాయితీ లోపించటమన్నది కొందరికి అర్థం కాకపోవచ్చు. నేను దీక్షగా పట్టుదలతో డైరీ రాయాలని ప్రయత్నం చేసిన కొత్తల్లో బయట పడ్డ బలహీనతగా దీన్ని విశ్లేషించాలి. డిగ్రీ కాలేజి దాటి యూనివర్శిటీ ప్రాంగణాల్లో అడుగుపెట్టాక నేను నిజాయితీగా రాయాలని ప్రయత్నిస్తే బయట పడ్డ కొన్ని ఆలోచన్లిలా వున్నాయి.

—నాకు చదువుమీద, కనీసం ఈ విధానంలో చెప్పబడే చదువుమీద నమ్మకంలేదు—

—మా రీడరుకు ఏమీ తెలీదు కనీసం అందరూ బహిరంగంగా అనుకునేంత పాండిత్యంకానీ, 'స్పార్క్' కానీ ఆయన్లో లేవు—

—సాహిత్యాన్ని ప్రేమించి బాగా చదువుకున్న మా లెక్చరర్ ఆ రీడర్ని పొగడ్డం చూస్తే యిద్దర్నీ కలిపి ఉడ్చి తన్నాలనిపిస్తోంది—

''మొన్నటి సాహిత్య సదస్సులో మీరు మాట్లాడారే! ఆహా! ఎంత అద్భుతంగా వున్నై సార్ మీ భావాలు! భావా లలాగుంచండి. మీరాశాక్తీయుల్ని గురించీ, సింబాలిజం గురించి మాట్లాడుతుంటే నాకేదో మత్తు చల్లినట్టుండింది''— ఇత్యాది—

ఈ లెక్చరర్ తన డాక్టరేట్ కోసం తాపత్రయ పడుతున్నాడు తన చదువూ, వ్యక్తిత్వం, గాంభీర్యం— అన్నీ పణంగా పెట్టి క్షుద్రదేవతో పాసకు డయ్యాడు తనో వెధవనీ తనతో పనుండి ఈ కుర్ర లెక్చరర్ ముఖస్తుతి చేస్తున్నాడని రీడరుకూ తెలుసు. ఐనా చిద్విలాసంగా నవ్వుతూ స్తోత్ర పారాల్ని స్వీకరిస్తున్నాడు

వీడికి డాక్టరేట్ యిస్తేచాలు ఏ రీడరోగాని తనూ అలాంటి భజనల్ని ఆకర్షిస్తాడు. అలా అలా సాహితీ సేవ చేసుకుంటూ అనూచానంగా డాక్టరేట్లు చల్లుతూ, భజనలు చేస్తూ చేయించుకుంటూ...—

వసుంధర కవిత్వం అల్లుతుంది తుణ్ణంగా నాలుగు సమాసాల స్వరూపమైనా ఎరుగని భావ కవిత్వం. అసలు భావంలేని ఎక్స్‌ప్రెషన్ ఎక్కడుందని కవిత్వాన్ని భావకవిత్వమని ప్రత్యేకంగా చెప్పకోటానికి? లోతుగా చూస్తే అంతా బూతూ,

కోరికామా. గులాబీని రెమ్మలు విరిచి చూస్తే ఏముంది? బాటనీవాళ్ళ నడగాలి

బాటనీ లెక్చరర్ సౌందర్య తనకు బాగా పరిచయమైంది. వెకిలి వేషాలూ ఆవిడామా. తనకున్న పరిచయాన్ని పురస్కరించుకుని క్లాసులేకుంటే ఇంగ్లీషు సినిమా మేటనీ కెళదాం రమ్మందో రోజు కోరికల్లో కాలిపోతున్న కొలిమిలా కనబడిందావిడ తన కళ్లకు మాట్నీ అయ్యాక పోష్ హోటల్లో చిన్న పార్టీ యిచ్చింది

"కథలు రాస్తూ జీవితం వడపోసిన వాడిలా ఏమిటి జీవితానికి సాఫల్యం ? ఈ వయసో పదేళ్ళు పెరిగాక మనకేం మిగిలిస్తుందో చెప్పు" అందామె.

"మరేనండీ" తను

"నా తలకాయ నువ్వు బాటనీ ఎందుకు తీసుకోలేదు ? నా స్టూడెంటయ్యుండే వాడివి."

ఇదెందుకు మధ్య ?

శారీరకంగా నీతిమీద తనకున్న అభిప్రాయాల్ని గురించి ఇద్దరు ముగ్గురు చర్చల్లోకి దిగారు తనతో తన రీడరూ ఒకడు

అంతా అయ్యాక "సౌందర్యా మేడం ఏమంటోందోయ్ ?" వెకిలి నవ్వు

"ముసలికంపు దాచుకోటానికి పువ్వేసుకున్న క్రీములూ హేర్ డయ్యూ కూడా వెలిసి ఈ విశ్వమంతా నిండి కంపు కొడుతూన్నాయి అని చెప్పిందండి" అని చెప్పలేక కాంప్రొమైజ్‌గా ఒక వెర్రి నవ్వునవ్వాడు తను.

కాంప్రొమైజ్ — సర్దుకొని వెళ్లటం

ఏది తీవ్రంగా కావాలనుకుంటామో చెయ్యాలనుకుంటామో, బుద్ధి పూర్వకంగా దాన్ని వదలుకోవటం, చెయ్యకపోవటం — ఇంకా ప్రోరం ఏది చెయ్యకూడదనుకుంటామో దాని కోరి చెయ్యటం — సర్దుకో సర్దుకో — కాంప్రొమైజ్‌కా

తన ప్రక్కన కూర్చున్న సుబ్బారావు ఒంటి కంపుతో కాంప్రొమైజ్ కాంటీన్‌లో కాఫీ పేరున దొరికే నీళ్లతో కాంప్రొమైజ్. రాత్రి చలితో దోమలతో కాంప్రొమైజ్ పది రూపాయలు పారేసి ధైర్యం చేస్తే తగ్గే యుగయుగాల నరాల వొత్తిడితో నీతిపేర కాంప్రొమైజ్, భయంతో నాగరికతతో కాంప్రొమైజ్

అందుకే రీడర్‌తో తను అనదల్చుకుంది అనలేదు

"లోక కోసేస్తాడోయ్ వీడూ" సామాన్యంగా ఆయన్ని గూర్చి వినవచ్చే కామెంట్. లోక కొయ్యడమేమిటి ? తనేం జంతువా ? జంతువులే నయం. మచ్చికై మనసుతో సంబంధంలేని ఆప్యాయతల్ని పెంచుకుంటాయి ఇష్టం లేకపోతే పళ్లికిలించవు. నిర్భయంగా తమ అసమ్మతిని తెలుపుతాయి అలా పరిణతిలో జంతువుల కంటే ఎన్నో మెట్లు పైనున్న మనిషి సరిపుచ్చుకోవడంతో చాలా కిందికే దిగజారాడు ఇదేనా ఎగ్జిస్టెన్షియలిజం ?

* * *

ఇవీ నా డైరీలో ఒకవారం నేను రాసుకోవాల్సిన ఆలోచనలు, అనుభూతులూ, సంఘటనలూ ! దురదృష్టవశాత్తూ జీవితంలో ఎక్కువ భాగం కుళ్ళనే చూశానేమో అనిపిస్తుంది కనుక నా స్వకీయాలూ, స్వగతాలూ సభ్య ప్రపంచానికి తెలిస్తే నా ఆరోగ్యానికేమంత మంచిది కాదనిపించింది

డైరీ రాయటం అలా సమాధి చేయబడ్డా, నాలోని ఆలోచనల్నీ నా అంతరంగ వేదననీ సమాధి చేయలేకపోయాను. నాకు తెలీకుండా నాలో మరో తీవ్రతరమైన శక్తి ఎప్పుడూ వేధిస్తూ, వెంటాడుతూ, పరిహసిస్తూ తపింపజేస్తూ, నిలకడ లేకుండా చేస్తూ వుంటుంది దాన్ని వెలికిలాగి పోట్లాడి గెలవాలని, తిరుగుబాటు చేయాలని, ప్రయత్నించి ఓడిపోయాను ఈ ఓటమే నన్ను సభ్య ప్రపంచం దృష్టిలో ఒకోమెట్టూ దిగజార్చింది

నా డైరీని, నా నిజాయితీని, నా వ్యక్తిత్వాన్నీ సమాధి చేసుకోగలిగిన నేను సులభంగానే ఎం ఏ లో క్లాసు తీసుకుని బయటపడ్డాను రాంక్ కూడా రావాల్సిందే కానీ నా కన్నా చక్కగా నాట్యం చెయ్యగలిగినవాళ్ళూ, నటనావతంసులూ ఉండటంతో ఫస్ట్‌క్లాస్‌తో సర్దుకున్నాను. కానీ నాకు వివారం కలిగించిన సంగతేమిటంటే పైకనబరచిన రాంక్ బాపతు వాళ్లల్లో ఆడపిల్లలూ వుండటం. నాకు బాగా తెలుసు వాళ్లలో ఎవరికీ చదువుపైన గొప్ప ధ్యాస లేదనీ వున్నా యూనివర్శిటీ వాళ్లిచ్చిన పురస్కారానికి వాళ్ళు తగరనీ

మా చదువుల భవితవ్యానికీ క్లాసులివ్వటానికీ మా రీడరుగారే దిక్కయ్యారు ఆ ఏడు — మా ప్రొఫెసరు విదేశాల్లో నిల్చిపోవటం వల్ల ఆయన సహాయంతో మైసూరులో ఒక సంవత్సర కాలం ట్యూటరుగా తాత్కాలికంగా పనిచేశాను

హైస్కూలమ్మాయిలా అందరికీ దూరంగా తొలగుతూ, కవిత్వం రాసి పేరు తెచ్చుకున్న వసుంధర ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరరుగా ఉద్యోగం సంపాదించి సాహిత్య సేవ చేస్తోంది ఆమెకు రిసెర్చికి సులభంగా సీటు దొరికింది నా కెలాగూ ఉద్యోగం లేదు కనుక ఆ విషయాన్నామెతో చర్చించి పాత పరిచయాల్ని తిరుగతోడదామన్న ఉద్దేశంతో ఆమె పనిచేసే కాలేజి కెళ్ళాను నాకూ రిసెర్చి చెయ్యాలని వుండేదారోజుల్లో

ఆడపిల్లల కాలేజి ఎక్కడ చూసినా అమ్మాయిలే. నా కళ్లకందరూ గొప్ప అందంగా కనబడ్డారప్పుడు ! ఏమి సొగసులు? ఏమి హొయలు ? విరబూచిన తంగేడువనంలా, విరగబూచిన దోస తోటలా కంటికి పండుగ్గా వుంది. ఏమిటీ వికార మనుకున్నాను. సౌందర్యోపాసన కూడా ఒక భౌతిక పరమైన స్పందనేనా ?

ఎందుకు వీళ్లకీ చదువుల తాపత్రయం ? ఏం సాధిద్దామని కలలుకంటూ కాలేజిల కెగబడుతున్నారీ అమ్మాయిలందరూ ? అసలో నిర్దిష్టమైన ధోరణి అంటూ వుందా వీరికి ? పెళ్లి చేసుకుని ఒళ్ళు పెంచుకుని పిల్లల్ని కనటానికేనా వీరి తపన?

"హలో రాజా ! ఏమిటిక్కడా దీర్ఘాలోచనలో మునిగిపోయావు ? యూనివర్సిటీలో అంతా కలలు కన్నావు. చాలలేదా ?" అంటూ వచ్చింది వసుంధర తేరుకుని చూశాను ఒక్క క్షణం ఆశ్చర్యపోయాను సంపాదించే స్థితికి ఎగ్రబాకినందుకో లేక తను చెప్పేదీ వినే ప్రాణులు దొరికినందుకో మరేమోకానీ మనిషిలో ధీమా పెరిగింది యూనివర్సిటీలో వున్న రెండేళ్లల్లో ఏ రెండు మూడుసార్లకన్న ఎక్కువగా మాట్లాడలేదు వసుంధరతో మరి యీ చనువూ, ధోరణీ నిజంగా కాస్త ఆనందాన్నిచ్చాయి నాకు

కాసేపు మౌనంగా చిరునవ్వు పులుముకుని నీళ్లు నమిలాను

కాఫీలూ మర్యాదలూ, పరామర్శలూ నా ఉద్యోగాన్ని గూర్చి చర్చలూ అన్నీ అయ్యాయి

"కాస్త మనసు విప్పి మాట్లాడు రాజా, ఎన్నాళ్ళైంది మనం యూనివర్సిటీ వదలి ? నీకు ఫస్ట్‌రాంక్ వస్తుందనుకున్నాం మేమంతా నువ్వు గొప్ప 'థింకర్'వి నీ ఒరిజినాలిటీ మాకెక్కడొస్తుందీ" అంది నవ్వుతూ

"అదే నా కొంప కూల్చింది క్లాస్ వచ్చింది చాల్లేద్దూ నీకు రాంక్ వచ్చిందిగా సంతోషం రిసెర్చికి ప్రయత్నం చేశావటగా ? ఆ ఏమిటి ? నాక్కాస్త వివరాలు చెబుతావనే వచ్చాను" అన్నాను

"ఏమిటో, అదో లంపట పోనిద్దూ నాకు డాక్టరేట్ వస్తుందన్న ఆశ చచ్చింది, టాపిక్స్ చూస్తుంటే. అన్నీ వారి యిష్టప్రకారం జరగాల్సిందే మరి" అంది చిన్నగా నిట్టూరుస్తూ

"నీవు ఏం చేసినా నీకు డాక్టరేట్ వచ్చి తీరుతుంది వసుంధరా ! రాంక్ రాలేదూ అలానే ! కాని పిచ్చమ్మాయ్ రాంక్ కోసం నీవు పడ్డ పాట్లు మాకు తెలీవని నీవనుకుంటే అక్కడే పొరపాటు పడుతున్నావ్" అని మాత్రం వసుంధరతో అనలేదు. నేను డైరీ రాయకపోవటం లాంటిదే యిదీనూ

నేను రిసెర్చి చేయలేదు చివరికి సాహిత్యం మీద ఏమూలో మిగిలిన అభిమానం నన్నా పనికి విముఖుణ్ణి చేసింది ఉద్యోగాల వేటలో తిరిగి, విసిగి వేసారాను చివరకు విసిగి ఏ అటెండరు వుద్యోగమో అయినాసరే చేయాల్సి వచ్చినా సిద్ధపడ్డాను అదీ అంత సులభంగా దొరకలేదు మనుగడ మానసికమైంది కాదు దానికి వ్యవస్థతో, ఆర్థిక పరిస్థితితో, దేశంలో నెలకొన్న వాతావరణంతో సంబంధముంది— అంతే తప్ప మన ఆలోచనల ధోరణితో ఏ మాత్రం లంకెలేదు నాకు మిగిలిఉన్న ఒకే రక్తబంధం నా అన్నకూడా ఈ వ్యవస్థకి బానిసే ఎక్కువ రోజులు నిరుద్యోగి తమ్ముణ్ణి ఎం ఏ. చదివించాకకూడా పోషించే స్థితిలో లేడు పాపం ఏదో అలా అన్నా వదినెల చూపుల్ని జీర్ణించుకుంటూ నెట్టుకొస్తు

## చిరునామాలు : మనవి

పత్రికలోపడ్డ రచయిత్రుల చిరునామాలు కావాలని రాయవద్దని మనవి మీరు వారికి రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం విజయవాడ—3 అని రాసినట్లయితే—మా కార్యాలయం నాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు రాయవద్దని మనవి.

— సం॥

న్నాను. కానీ ఆ రోజు అన్న తెచ్చిన ప్రస్తావన నన్ను పలాయితుణ్ణి చేసింది

"ఆ రెడ్డిగారమ్మాయి వసుంధరను చేసుకో, చక్కగా లెక్చరర్ వుద్యోగం ఇప్పిస్తారట నీ అంతటి వాడు దొరక్కకాదు ఆ అమ్మాయికి నువ్వంటే చచ్చేంత ప్రేమట. ఆమె మనసులో కోరిక తీరటానికే నిన్నెంచుకున్నారు బాగా ఆలోచించు చదువుకుని ఉద్యోగం చేసుకొంటోంది, చక్కగావుంది ఉండూళ్లో నీకూ ఉద్యోగం దొరుకుతుంది" అంటూ నివ్వెరపోయాను! వసుంధర మొగలిరేకు లాంటిది ఆ ముళ్లని జాగ్రత్తగా హేండిల్ చేసే శక్తి నాకు లేదు వసుంధర సౌందర్యవతే కానీ నా సౌందర్యారాధన నిరపేక్షం పెళ్లితో దాన్ని సమాధి చెయ్యలేను మా వీధిలో వాళ్ళు కొందరూ, ఉడిపీ, ధర్మస్థలమూ ఆ పరిసరాలకి బస్సు ఏర్పాటు చేసి నన్నూ రమ్మన్నారు. ఆ నెపంతో సమస్య నెదుర్కోటం వాయిదావేశాను

"మల్పే"— కర్నాటక రాష్ట్రంలో సముద్ర తీరంలోని ఒక చిన్న నగరం. మా 'టూర్'లో ఒక భాగంగా తగిలింది ఆవాతావరణమూ, ఆ పట్టణమూ చూశాక యింతకన్నా సదవకాశం రాదనిపించింది నా భుజానికున్న జిప్పర్ సంచితో మల్పేలో దిగేశాను ఎవరికంటా పడకుండా నిజానికి ఆ బస్సులో నన్ను గూర్చి పట్టించుకునేంత పరిచయస్థులూ ఎవరూ లేరుకూడాను

నాకున్న కొద్ది బట్టలూ, పుస్తకాలూ సంచిలో వుంచుకుని సముద్రతీరానికి నడిచివెళ్లాను చక్కటి బీచ్ వుంది — చిన్నదైనా మల్పేకి ఒక చివర

భాష, ప్రజలూ అంతా కొత్త తెలిసిన కుళ్ళు ఎక్కడా కనబడలేదు "ఏమిటోయ్ ! ఇంకా ఉద్యోగం రాలేదా ? ఏం చదువులోనయ్యా ఇవి ఎం ఏ ఫస్ట్ క్లాసేమో నీది పాపం" అనే వారు లేరు

"కథలు రాయి చాలు ఉద్యోగ మెందుకూ" అనే వదిన లేదు మూతి విరుచుకుని నాలుగు మెతుకులు రాల్చే వదినగారు అరుణారుణ ముఖం దర్శనీయం గాదు

"ఏం గురో ! నీ పనే హాయి చక్కా నాలుగు పుస్తకాలు చదవటం. రెండు కథలు రాయటం స్నేహితులతో కాలక్షేపం మా గతిచూడు ఉద్యోగం పేరున స్వేచ్ఛ నమ్ముకుని చస్తున్నాం" అనే మిత్రుల ఆవేదనలు వినబడవు

"పర్ఫెక్షనిస్టువి నువ్వు అందుకే నిరాశావాది వయ్యావు" అనే మా రీడర్ లేడు నిరాశావాదిని కాను కనుకనే ఏం బ్యాంకి టెస్టు పాసయ్యి, క్లర్కుగా చేరి డిపార్ట్‌మెంటల్ టెస్టులు చదివి పేస్కేళ్ల వాదోప వాదాల్లో మునగలేదు అది ఆయన కర్థం గాదు

అపరిచితమైన వీధులు —
నే నెరుగని గాలి —

నన్ను ఒంటరిగా చీకట్లో చూసీ మొరగని కుక్కలు —

సముద్రతీరంలో నిరంతరంగా నురగలు క్రక్కుతూ విరుచుకుపడుతున్న అలలూ — నేనో బార్‌లో పనిచేశాను జీవిక కోసం. బార్ యజమాని

## "ఉపాసన"

'గౌడ్'కు తెలుగునాట బంధువులున్నారట. అతడి పూర్వీకులు తెలుగువారేనట నేను చదివిన తెలుగు చదువు నాకు దేశంకాని దేశంలో బార్ టెండర్‌గా ఉద్యోగం రావటానికి కారణ భూతమైంది

గౌడ్‌తో నా పరిచయం చాలా యాదృచ్ఛికంగా జరిగింది, ఉడిపికి రాకముందు బేలూరు శిల్పాల్ని చూస్తున్నాను.

ఉలి తాకిడికి కఠిన శిలలు కరిగి వెన్నలా మలచటానికి వీలుకలిగిందేమోనన్న అనుభూతి కలిగిందా శిల్పాల్ని చూస్తుంటే. ఆ శిల్పులు గొప్ప సౌందర్యారాధకులూ, సాధకులూ అయివుండాలి. ఒక టూరిస్ట్ గైడ్ చక్కటి ఇంగ్లీషు భాషలో సాలభంజికల సౌందర్య సంపదని వర్ణిస్తున్నాడు. ఆ శిల్పాల్ని చూట్టమే ఒక గొప్ప సౌందర్యపరమైన అనుభూతి.

ఒకణ్ణే తిరిగి వచ్చాను— ఆ రాత్రి. శిల్పాల్ని చూడాలని.

వెన్నెల్లో తడిసిన వంపుల్ని గాలికి ఆరబెట్టుకుంటున్న శిలా సుందరుల సొంపుల్ని చూసి వారి పాదాల దగ్గర తలబాదుకుని చావాలన్న బలవత్తరమైన కోరిక కలిగింది.

"క్షమించాలి. ఈ శిల్పాల్ని ప్రొద్దుట కూడా చూశారనుకుంటాను" అన్న పలకరింపు ఆంగ్ల భాషలో వినబడింది. వెనక ఓ ఆజానుబాహువు చిరునవ్వుతో నించునివున్నాడు. బదులుగా నేనూ నవ్వాను చిన్నగా.

"ఇలా ఒంటరిగా ఈ చోటుకి రావటం మంచిది కాదు అసలు రానీరుకూడాను మీరెలా వచ్చారో మరి ! మీరెక్కడ బసచేశారు ? బైదిబై, నా పేరు గౌడ్, నేను 'మల్పే'లో ఓ చిన్న బార్ 'కం' రెస్టారెంట్ నడుపుతున్నాను" అన్నాడు స్నేహపూర్వకంగా.

"నిజమే ! ఈ శిలా సుందరులు పగలంతా మనుషులకి భయపడి నిర్జీవంగా వుండిపోయి ఈ వెన్నెల్లో ఈ ఏకాంతంలో ఊపిరులు నింపుకుని మనసున్న మానవులతో కమ్యూనికేట్ చెయ్యగలవు మనల్ని ఆ సౌందర్యమనే నిరంతర తత్వానికి లాక్కెళ్లే ప్రమాదముంది ఒప్పుకున్నాను నా పేరు రాజు ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురంజిల్లా వాణ్ణి" అన్నాను మనస్ఫూర్తిగా

దగ్గరకువచ్చి కౌగిలించుకున్నంత పనిచేశాడు. గౌడ్ నా చదువు గురించి తప్ప దాదాపు నా సంగతంతా తెలుసుకున్నాడు

తనకు పార్ట్‌నర్‌గా వుండమన్నాడు

"నా ముఖం పార్ట్‌నరేమిటి ? బార్‌లో ఏదైనా చిన్న ఉద్యోగమిస్తే చాల"న్నాను అలా గౌడ్ స్నేహమూ బతకటానికో చిన్న ఆధారమూ లభించాయి గౌడుకు తెలుగు బాగా వచ్చని తెలిసింది తరువాతి దినాల్లో

ఆ రోజు బార్‌లో డ్యూటీ ముగించుకొని రూముకొచ్చాను. రాత్రి పదిగంటలైంది స్నానం చేసి సముద్రతీరానికెళ్లటం అలవాటుగా మారింది బయలుదేరే సమయానికొచ్చాడు గౌడు కార్లో బాగా తాగివున్నాడని తెలుస్తోంది

"రాజూ ! ఇలారా. నీతో డ్రింక్ తీసుకోవాలి రోజు కార్లో అన్నీ సిద్ధం చేశాను ఇక్కడకాదు హవేలీదు గెస్ట్‌హౌస్‌కెళ్లాలి పద !" అన్నాడు నా అభ్యంతరాలన్నీ తోసిపుచ్చి లాక్కెళ్లాడు

హవేలీదంతా శివమయం

"శివుడు పెద్ద కమ్యూనిస్టు రాజూ ! నీకు తెలవదులే క్షీరసాగర మథనంలో శివుడికేం దక్కింది? అసలు క్షీరసాగర మథనమంటే ఏమిటనుకున్నావూ? ఈ బతుకుని మథించటమే దానికి చూశావూ, నాలాటి రాక్షసులంతా ఒకవేపూ, నీలాటి దేవుళ్ళంతా మరోవేపూ విషసర్పాన్ని పట్టుకున్నారు అందులో చిక్కిన సుందరమైన లక్ష్మినీ దివ్యాశ్వాన్నీ విష్ణువు లాటి వాళ్ళు సొంతం చేసుకున్నారు శివుడు— పాపం సింపుల్ క్రీచర్ హాలాహలం కూడా పుట్టిందా? దాన్ని భరించటానికి శివుడు కావాల్సి వచ్చాడు రాజూ నీవు శివుడి లాటివాడివి

యూనివర్శిటీలో నీకు ఏదీ దక్కలేదు బతుకులో ఉద్యోగాలూ, వ్యాపారాలూ హోదాలూ నీకు దక్కలేదు నీకు దక్కిందంతా చివరికీ బార్ టెండర్ ఉద్యోగం అంతేనా రాజూ?" అన్నాడు విరగబడి నవ్వుతూ.

"యూనివర్సిటీ ఏమిటి గౌడ్ ? నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?" అన్నాను కంగారుగా

"నేను చెబుతా విను రాజూ! నేను గుర్తున్నానా నీకు ? నేను యూనివర్సిటీలో బాటనీ లెక్చరర్‌గా పనిచేశాను మై నేమీజ్ సౌందర్యాగౌడ్! నీ గురించి వారికంతా తెలుసు ఎటుదిరిగీ నీకే నీ సంగతి తెలీదు పాపం అందంగా వున్నదాన్నారాధించి అనుభవించ లేకపోవటమూ, అందవిహీనమైన దాన్ని ఏవగించుకుని దాన్నుండి తప్పించుకోలేక పోవటమూ నీకో శాపం అవునా" అంది వెనక సీట్లో ఓ గొంతు. చీకట్లో అసలు ఆమెని గమనించనే లేదుకాని ఆ గొంతులోని దుఃఖపుజీర తెలుస్తూనే వుంది

మరునాటి ఉదయం నాకున్న కొన్ని పుస్తకాలూ, బట్టలూ జిప్పర్ సంచిలో వేసుకుని, బస్సెక్కాను ★

### తెలుసుకో

అద్దం మన ప్రతిబింబాన్ని
చూపించినట్లే
మనం చేసే అన్యాయాలను
అంతరాత్మ గుర్తు చేస్తుంది

దీపం చిన్న దయినా
గదినిండా వెలుతురు నింపినట్లే
ఉపకారం కొద్ది దయినా
కొందరి జీవితాలను కాపాడుతుంది

—భైరి సత్యనారాయణ ★